మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి



మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
సోమవారం | 11 | మే | 2026 | పేజీలు : 12

# నేడు కలెక్టరేట్‌లో పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

**- అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ**
**నెంబర్ 1100కు కాల్ చేసి తెలుసుకోవాలి : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి , మే 10 ( మనం న్యూస్ ) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్), రెవిన్యూ క్లినిక్ ల కార్యక్రమాలను నేడు మే 11 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంతో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల లో నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటన లో పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు. పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ ల కు హాజరు కాని అర్జీదారులు (మీ కోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు.



# కోటబొమ్మాళిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటన

**- రూ.54 లక్షలతో తహసీల్దార్ కార్యాలయం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన**

**కోటబొమ్మాళి , మే 10 ( మనం న్యూస్ ) :** టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం పునరుద్ధరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 54 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా కార్యాలయ భవనాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని

# "గంజాయి నిర్మూలించడం అనేది సాధారణ ఆపరేషన్ కాదు
# సమాజ రక్షణ కోసం చేసిన యుద్ధం : అడిషనల్ ఎస్పీ నవజ్యోత్ మిశ్రా



2వ పేజీలో

**చింతపల్లి , మే 10 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో ఒకప్పుడు విస్తారంగా సాగైన గంజాయి రవాణా ఇప్పుడు పూర్తిగా కనుమరుగైందని, పోలీస్ శాఖ చేపట్టిన కఠిన చర్యల ఫలితంగా గంజాయిని పూర్తిగా నిర్మూలించగలిగామని చింతపల్లి అడిషనల్ ఎస్పీ నవజ్యోత్ మిశ్రా స్పష్టం చేశారు. మన్యంలో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మాఫియాపై పోలీసులు రాజీ లేకుండా పోరాడారని, ఈ విజయంతో జిల్లా చరిత్రలో ఒక కీలక మలుపు తిరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గుట్టలు, అటవీ ప్రాంతాలు, లోయలు కేంద్రంగా సాగిన గంజాయి పంటలను గుర్తించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు, డ్రోన్ కెమెరాలు, కూంబింగ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించినట్లు తెలిపారు. వందలాది ఎకరాల్లో సాగు చేసిన గంజాయి పంటలను నేలమట్టం చేసి, అక్రమ రవాణా ముఠాలపై ఉక్కుపాదం మోపామని వెల్లడించారు.

# సిక్కోలు' పేకాట రాయుళ్లకు గన్ షాక్..!!

## రూ.37 లక్షలు దోపిడీ



**ఉత్తరాంధ్ర , మే 10 ( మనం న్యూస్ ) :** పక్క రాష్ట్రం వెళ్తే పట్టు ఉండదని భావించిన శ్రీకాకుళం జిల్లా పేకాట రాయుళ్లకు చుక్కెదురైంది. ఒడిశా రాష్ట్రంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో జూదమాడుతున్న వీరిపై తుపాకులతో ఒక గ్యాంగ్ విరుచుకుపడింది. ఈ దాడి లో సుమారు 37 లక్షల రూపాయల నగదుతో పాటు భారీగా బంగారు ఆభరణా లను దుండగులు దోచు కెళ్లారు. సర్వం కోల్పోయిన జూదరులు కట్టుబట్టలతో ప్రాణ భయంతో జిల్లాకు పరుగులు తీసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.



2వ పేజీలో

**పోలీసుల నిఘా తప్పించుకోవాలని స్కెచ్..**

శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల కాలంలో పోలీసులు జూద కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో జిల్లాలోని ప్రముఖ పేకాట రాయుళ్లంతా తమ స్థావ రాల ను పక్క రాష్ట్రమైన ఒడిశాకు మార్చా రు. ఈ క్రమంలోనే గత గురువారం జిల్లాకు చెందిన సుమారు 12 మంది ప్రధాన జూదరులు మూడు విలాసవంతమైన

## సమాజ రక్షణ కోసం చేసిన యుద్ధం : అడిషనల్ ఎస్పీ నవజ్యోత్ మిశ్రా

**ఒకటి తరువాయి** "గంజాయి నిర్మూలన అనేది సాధారణ ఆపరేషన్ కాదు... ఇది సమాజ రక్షణ కోసం చేసిన యుద్ధం" అని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి వల్ల యువత మత్తుకు బానిసలవుతున్నారని, కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమాయక గిరిజనులను డబ్బు ఆశ చూపించి ఈ అక్రమ దందాలోకి లాగిన ముఠాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ విజయానికి గిరిజన ప్రజల సహకారమే ప్రధాన కారణమని నవజ్యోత్ మిశ్రా కొనియాడారు. గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, యువకులు పోలీసులకు సమాచారం అందించడం వల్లే గంజాయి సాగును పూర్తిగా అరికట్టగలిగామని చెప్పారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, రాత్రింబవళ్లు నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. గంజాయి సాగు చేసిన ప్రాంతాల్లో ఇప్పుడు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామని వెల్లడించారు. కాఫీ, మిరియాలు, పసుపు వంటి లాభదాయక పంటలతో గిరిజన రైతులు కొత్త జీవితం ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మన్యంలో గంజాయి మళ్లీ తలెత్తకుండా కఠిన చర్యలు కొనసాగుతాయి. యువత భవిష్యత్తు కోసం పోలీస్ శాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది" అని అడిషనల్ ఎస్పీ నవజ్యోత్ మిశ్రా హెచ్చరించారు. జిల్లా ప్రజలు కూడా ఇదే విధంగా సహకరించాలని కోరారు.

## సిక్కోలు' పేకాట రాయుళ్లకు గన్ షాక్..!!

**ఒకటి తరువాయి** కార్లలో భారీ నగదుతో ఒడిశాకు వెళ్లారు. రాయగడ సమీపంలోని ఒక మామిడి తోటను తమ ఆట విడుదిగా ఎంచుకున్నారు.

**తోటలో తుపాకులతో ప్రత్యక్షమైన గ్యాంగ్**

శుక్రవారం మధ్యాహ్నం ఆట జోరుగా సాగుతున్న సమయంలో, ఒక్కసారిగా ఒక గ్యాంగ్ తుపాకులతో అక్కడ ప్రత్యక్షమైంది. ముఖాలకు ముసుగులు ధరించిన దుండగులు పేకాట రాయుళ్లను చుట్టుముట్టి గన్ పాయింట్‌లో బెదిరించారు. ప్రతిఘటించే ప్రయత్నం చేసిన వారిని తీవ్రంగా హెచ్చరించడంతో, ప్రాణ భయంతో జూదరులు నోరు మెదపలేదు.

**లక్షల నగదు, బంగారం గోవిందా!**

దుండగులు అక్కడ ఉన్న నగదు కట్టలతో పాటు, జూదరుల ఒంటిపై ఉన్న బంగారు గొలుసులు, ఉంగరాలను సైతం వదలకుండా దోచుకున్నారు. దోపిడీకి గురైన మొత్తం విలువ సుమారు రూ. 37 లక్షలు ఉంటుందని అంచనా. దోపిడీ అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారవ్వగా, బాధితులు దిక్కుతోచని స్థితిలో ఖాళీ చేతులతో శ్రీకాకుళం చేరుకున్నారు.

**పరువు పోతుందన్న భయంతో మౌనం**

ఇంత పెద్ద ఎత్తున దోపిడీ జరిగినా, బాధితులు పోలీసులను ఆశ్రయించడానికి సాహసించడం లేదు. తాము పేకాట ఆడుతూ దొరికితే పరువు పోవడమే కాకుండా, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, ఈ 'తుపాకీ దోపిడీ' ఉదంతం జిల్లావ్యాప్తంగా దావానలంలా వ్యాపించింది.

## కోటబొమ్మాళిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటన

**ఒకటి తరువాయి** మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు లేకుండా సేవలు పొందేలా భవనాన్ని సకల సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు.అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ , అధికారులు తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## "మాతృదేవోభవ - పితృదేవోభవ - ఆచార్యదేవోభవ అనే మూడు మహోన్నత సూత్రాలే మానవ జీవితానికి పునాదులు : డాక్టర్ సీపాన గుణవతి

**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** తల్లి జన్మనిస్తుంది, తండ్రి పెంచి పోషిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తాడు, గురువు జ్ఞానాన్ని ప్రసాదించి జీవితానికి దిశానిర్దేశం చేస్తాడు. ఈ ముగ్గురిలో తల్లి స్థానం అత్యున్నతమైనది" అని ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి భావోద్వేగంతో పేర్కొన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఒక తల్లి తన పిల్లల కోసం జీవితాంతం ఎన్నో త్యాగాలు చేస్తుందని తెలిపారు. పిల్లలు సుఖంగా ఉండాలని తాను కష్టాలు భరిస్తూ, ఆకలి దప్పికలను కూడా మరిచి వారి భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుందని చెప్పారు. గర్భంలో తొమ్మిది నెలలు మోసి, జన్మనిచ్చి, ప్రేమతో పెంచి, మంచి మార్గంలో నడిపించే మహోన్నత వ్యక్తి తల్లేనని అన్నారు. తన తల్లి రోహిణి అమ్మను స్మరించుకుంటూ డాక్టర్ గుణవతి కన్నీటి పర్యంతమయ్యారు. గత ఏడాది తన తల్లి తిరిగిరాని అనంత లోకాలకు వెళ్లిపోవడం తన జీవితంలో ఎన్నటికీ తీరని మాతృవియోగాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "తల్లి ఉన్నప్పుడు ఆమె ప్రేమ విలువ పూర్తిగా అర్థం కావడం లేదు. కానీ తల్లి దూరమైన తర్వాత ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలే వెంటాడుతుంటాయి. తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు" అని భావోద్వేగంతో తెలిపారు. నేటి సమాజంలో యువత తల్లిదండ్రుల సేవలను మరచిపోతుండటం బాధాకరమని ఆమె



అన్నారు. తమ జీవితాలను పిల్లల కోసం అంకితం చేసిన తల్లిదండ్రులను గౌరవించి, ప్రేమతో చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి సంతానానిదని పేర్కొన్నారు. కానీ కొందరు యువత తల్లిదండ్రులను భారంగా భావించి వృద్ధాశ్రమాలకు పంపించడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజ హితానికి ఎంతమాత్రం మంచిది కాదని, కుటుంబ వ్యవస్థలను బలహీనపరిచే ప్రమాదకర పరిస్థితి అని హెచ్చరించారు. తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమని, వారి ఆశీర్వాదం లేకుండా జీవితంలో నిజమైన ఆనందం, అభివృద్ధి సాధ్యం కాదని డాక్టర్ గుణవతి అన్నారు. ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతతో ఉండి, వారిని పూజించి, సేవ చేయడం ద్వారా వారి రుణం తీర్చుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి కుటుంబ బంధాలకు, పెద్దల గౌరవానికి ప్రతీక అని, ఆ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా తల్లుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ వారిని ప్రేమతో గౌరవించాలని డాక్టర్ గుణవతి పిలుపునిచ్చారు.

## శ్రీ ప్రకాష్ లో ముగిసిన వేసవి శిబిరం

**పాయకరావుపేట , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల లో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరం శనివారం ముగిసింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నిగూఢ నైపుణ్యాలను, వారి ప్రతిభా పాటవాలను వెలికితీసేం దుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సి హెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు లో విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, వాలీ బాల్, క్రికెట్, కబడ్డీ, డాన్స్, తదితర అంశాల పై నిష్ణాతులైన కోచ్ లతో మెలుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపు నందు విద్యార్థులు




వివిధ అంశాలనందు మెళుకువలు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరచడం ఆనందదాయకమని, విద్యార్థులు అన్ని రంగాలనందు రాణించాలనే విషయానికి శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తాయని, నిత్యం విద్యార్థులు ఆడే ఆటలు వారి శారీరక దారుఢ్యం పై ప్రభావం చూపుతాయని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపు లో క్రీడల నందు, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్ నందు నేర్చుకున్న మెలుకువలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. రోజూ ఒక గంట సమయాన్ని వ్యాయామం, క్రీడల కోసం కేటాయించాలని తెలిపారు. ఆటల ద్వారా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే స్థైర్యం వారికి అలవడుతుందని ఆయన తెలిపారు.

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు తమ విద్యా సంస్థల నందు విద్యలో ఒక భాగమని, విద్యతో పాటుగా ఆటలకు కూడా తమ విద్యా సంస్థలు ఇస్తున్న ప్రాధాన్యత ద్వారానే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నందు అగ్రగా ములుగా నిలుస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం క్యాంపు లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ ఆటలకు చెందిన కోచ్ లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు పరిశీలించిన బీజేపీ నాయకులు



**ఆనందపురం , మే 10 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం బోని గ్రామంలో వీబీ జీ రామ్ జీ ఉపాధి హామీ పథకం పనులను ఆదివారం బిజెపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పొట్నూరు వెంకట కృష్ణ రావు, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్,బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, ఆనందపురం మండల పార్టీ అధ్యక్షురాలు పిల్లా విజయ, విశాఖ జిల్లా కౌలు రైతుల జిల్లా కన్వీనర్ సారిక ప్రకాష్,కో - కన్వీనర్ కనకల నరసింగరావు, బోని మాజీ సర్పంచ్ సూరల సత్య వర ప్రసాద్,విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసాల రాము నాయుడు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఉపాధి నిమిత్తం పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని గత ప్రభుత్వం మన రాష్ట్రంలో లబ్ధిదారులకు అందవలసిన డబ్బులు పక్క దారి పట్టేవని, దానికి కారణంగా ఆన్లైన్ ద్వారా, ఫోటో ఆధార్ నమోదు వల్ల ఈ పథకం ద్వారా నేరుగా లబ్ధిదారి అకౌంట్లో జమ అవుతుందన్నారు.ఆంధ్రప్రదేశ్ కు వీ బీ జీ రామ్ జీ నిధులు ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాలు,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి రెండు లక్షల బీమా సదుపాయం ఉంటుందని సూచించారు. లబ్ధిదారులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చిలుకు సత్యనారాయణ విశాఖ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శిలు డి.రామ కృష్ణ రాజు,డి.పి.రాజు,కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు హంస మహేష్,మండల ఉపాధ్యక్షులు ఉప్పల బాను,సి.హెచ్. సన్యాసిరావు,పరదేశినాయుడు వి.ఆర్.పి.దుర్గారావు,అప్పల సత్యనారాయణ మరియు విశాఖ జిల్లా కిసాన్ మోర్చ టీం, విశాఖ జిల్లా కౌలు రైతుల టీం పాల్గొన్నారు.

# రైతాంగానికి సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

**- చోడవరం సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ.డి.ఏ) రవీంద్రనాథ్**



**చోడవరం , మే 10 ( మనం న్యూస్ ) :** ఏపి వ్యవసాయ శాఖ ద్వారా 2025 -26 కి సంబంధించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా, ప్రభుత్వం ఆమోదించబడిన యంత్ర పరికరాలు వ్యక్తిగతంగా రైతాంగానికి అందజేస్తున్నట్లు చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏ.డి.ఏ) రవీంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్, వ్యవసాయ యాంత్రీకరణ ఉపమేషన్ నిబంధనలు ప్రకారం యంత్ర పరికరాలు ధరలను ఎంపానల్ మెంట్ చేయడం జరిగిందని, కావలసిన రైతులు ఆన్లైన్లో అప్లై చేసుకుని వ్యవసాయ పరికరాలు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. దరఖాస్తు చేయడానికి నేషనల్ ఇన్ఫర్మే టిక్స్ సెంటర్, విజయ వాడ వారు ఒక అప్లికేషన్ రూపొందించడం జరిగిందని, ఆ వెబ్సైట్ హెచ్ టి టిపిఎస్:// ఎస్ ఈ ఈ డి. ఏపీ.జీవో వి. ఇన్ /ఎఫ్ ఎం/ఫార్మర్ రిజిస్ట్రేషన్ నందు రైతులు నేరుగా లేదా రైతు సహాయ కేంద్రం (ఆర్.ఎస్.కె) సిబ్బంది ద్వారా గాని ఏ రకమైన పనిముట్లు కావాలో ఆన్లైన్లో అప్లై చేసుకోవాలన్నారు. అప్లై చేసుకునే రైతులకు భూమి కచ్చితంగా ఉండాలని, ఆన్లైన్లో ఆర్ఓ ఎఫ్ఆర్ రైతుల కూడా అర్హులే అని తెలి పారు. గత మూడు సంవత్సరాల్లో ఏదైనా పంట సీజన్లో కౌలు కార్డు తీసుకున్న వాళ్ళు ఉంటే వాళ్ళు కూడా అర్హులే అన్నారు. అలాగే కుటుంబంలో ఒక సభ్యుడికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటదని తెలిపారు. 2024 -25 సంవత్సరంలో సబ్సిడీపై ఎవరైతే యంత్ర పరికరాలు తీసుకున్న వారు మాత్రం అర్హులు కారని తెలియ జేశారు. రైతు దరఖాస్తు అప్లై చేసిన తర్వాత వాళ్ళ యొక్క భూమి వివరాలు, ఈ పంట, గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా వాళ్ళ ఎలిజిబుల్టి పోర్టల్ నందు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న మరియు సన్నకారు రైతులు, మహిళలకు 50% రాయితీపై, ఇతరులకు 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగు తుందని తెలియజేశారు. ఈ యంత్ర పరికరాలు సరఫరాదారులు 2026వ సంవత్సరంలో తయారుచేసినవి మాత్రమే సరఫరా చేస్తారని అన్నారు. మండలానికి 40 హెచ్.పి. లేదా అంత కన్నా తక్కువ ఉన్న ట్రాక్టర్ ఒకటి, పవర్ టిల్లర్స్-2, పవర్ వీడర్స్ -3, స్ప్రేయర్లు - మందు పిచికారి చేసుకునే పంపులు -30 (ఎంత మంది రైతులైన పెట్టుకో వచ్చు), ... ఈ పిచికారి చేసే పంపుల్లో పెట్రోల్ పంపులు, ట్రాక్టర్ తో నడిచే పం పులు కూడా ఉన్నాయి న్నారు. విత్తనాలు, ఎరువు వేసే సీడ్ కం ఫర్టిలైజర్-1, ట్రాక్టర్ తో నడిచే నాగల సెట్టులు / రోటవేటర్స్/ దమ్ము సెట్టులు-5, నూర్పు యంత్రాలు/ ఎండుగడ్డి మరియు మేత సామాగ్రి -2 మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలానికి 40 యంత్రాలు - రూ. 15.59 లక్షల విలువ కలిగిన సబ్సిడీతో యంత్ర పరికరాలు తీసుకోవడానికి టార్గెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ నెల 19 వరకు దరఖాస్తు చేసు కోవడానికి సమయం ఉందన్నారు. తర్వాత వెబ్సైటు క్లోజ్ అయిపోతుందని, ఆన్లైన్లో అప్లై చేసిన దరఖాస్తులను జిల్లా ఇంచార్జి మంత్రి ఖరారు చేస్తారని తెలియజేశారు. ఆ తర్వాత లాటరీ ప్రక్రియ ద్వారా జిల్లాలోని మండలాల వారీగా, సామాజిక వర్గాల వారీగా ఈ లాటరీ ప్రక్రియ అనేది జాయింట్ కలెక్టర్ అనకాపల్లి వారి సమక్షంలో నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ లాటరీ ప్రక్రియ అయిన తర్వాత ఎవరైతే లబ్ధిదారులు అర్హులుగా గుర్తించారో, వారికి కమ్యూనికేషన్ ఎస్.ఎం.ఎస్ ద్వారా పంపబడుతుందని తెలియజేశారు. మంజూరు పత్రంను జాయింట్ కలెక్టర్ జారీ చేస్తారని, ఈ మంజూరు పత్రం జారీ అయిన 15 రోజుల్లోపు లబ్ధిదారులు వెబ్సైట్లోకి వెళ్లి పేమెంట్ అంటే ఏదైతే రైతు కట్టాల్సిన వాటా ఆన్లైన్లో పేమెంట్ చేసి కొనుగోలు ఆర్డర్ ను తీసుకోవ చ్చన్నారు. ఆర్డర్ ఇచ్చిన 30 రోజుల్లో సంబంధించిన డీలరు రైతుసేవ కేంద్రానికి పరికరాలను సప్లై చేయడం జరుగుతుందని తెలిపారు. ఆశక్తి గల వారు మండలంలో ఉన్న రైతు సేవ కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయ కులను సంప్రదించి ఆన్లైన్లో అప్లికేషన్ పెట్టుకోవాల్సిందిగా కోరారు.

# మండలంలో స్వచ్ఛ రథాల సేవలు !!!



**చోడవరం , మే 10 ( మనం న్యూస్ ) :** మే 10, చోడవరం మండలంలో లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం స్వచ్ఛ రథాల సేవలు అంద జేశారు. ఈ.వో.ఆర్డి అర్జునరావు ఆధ్వర్యంలో ఏర్పాటయిన స్వచ్ఛ రథంను స్థానికులు, ప్రజలు ఉపయోగించుకున్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ లక్ష్యంతో కూటమి ప్రభుత్వం మండలానికి కేటాయించిన రెండు స్వచ్ఛ రథాల్లో, ఒక రథానికి ప్రభుత్వ పర్మిషన్ రాలేదని మండల పరిషత్ అధికారి తెలిపారు. గ్రామంలో ప్రతీ ఇంటి లోనూ పనికిరాని తడి, పొడి చెత్తను అందజేసి,.... స్వచ్ఛ రథం ద్వారా వినియోగదారులకు కావలసిన వస్తువులను అంద జేశారు. స్వచ్ఛ భారతే లక్ష్యంగా ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ గ్రామీ ణ పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో స్వచ్ఛ రథాలను ప్రవేశపెట్టారని ఈ.ఓ.ఆర్డి అర్జున రావు తెలి పారు. దీనిలో భాగంగా స్వచ్ఛ రథాలతో గ్రామాల్లో స్వచ్ఛతే హే సేవ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

# బాటసారుల దాహార్తి కి బాసట...!!

**ఫ్రెండ్లీ టీం హార్డ్ వర్క్..మజ్జిగ పంపిణీ..పలువురి ప్రశంసలు**

**విశాఖపట్నం , మే 10 ( మనం న్యూస్ ) :** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఫ్రెండ్లీ టీం వర్క్ సభ్యులు ముందుకు వచ్చారు. విశాఖపట్నంలోని రైల్వే న్యూ కాలనీ శ్రీనివాస కళ్యాణ మండపం ఎదురుగా మజ్జిగ చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ... మండుతున్న ఎండల్లో ప్రయాణించే ప్రజలకు చల్లని మజ్జిగ అందించడం ద్వారా సామాజిక సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ ఔట్సోర్సింగ్ డ్రైవర్లుగా టౌన్ కొత్త రోడ్ సూయజ్ ఫారంలో విధులు నిర్వహిస్తూ, సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొం



టున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. కనకరాజు, ఎస్. శివ లక్ష్మణ్, జి. అనంత్, కే. ఆనంద్, డి. సంతోష్ కుమార్, సిహెచ్. వాసు, డి. అరుణ్ కుమార్, బి. శ్రీనివాస్, కే. స్వామి, జి. నీలయ్య, సిహెచ్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏమైందో ఏమో కానీ..!

## మహిళ ఆత్మహత్యాయత్నం



**విశాఖ క్రైమ్ , మే 10 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్ వద్ద ఆదివారం ఉదయం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హృదయాలను కలచివేసింది అధిక మోతాదులో మత్తు బిళ్లలు సేవించిన ఆమె బీచ్ ఒడ్డున స్పృహ కోల్పోయి పడిపోయినట్లు సమాచారం. బీచ్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు మహిళను గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ వివరాలు, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# భక్తుల సౌకర్యార్థం "మనమిత్ర "వాట్సాప్ సేవలు

## - శ్రీ స్వామి వారి దర్శనం సేవలు..ఇక మరింత సులభం : ఇఓ



**విశాఖపట్నం, మే 10 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, "శ్రీ స్వామి వారి భక్తుల కోసం "సరికొత్త డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని ఆలయ కార్య నిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవస్థలు తప్పించడానికి 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. భక్తులు తమ ఇంటి వద్ద నుండే 100 మరియు 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను, వివిధ ఆర్జిత సేవలను, ప్రసాదం టోకెన్లను, మరియు వసతి గదులు వాట్సాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు."మనమిత్ర' ద్వారా టికెట్లు పొందిన భక్తుల కోసం దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. దీనివల్ల సాధారణ క్యూలైన్ రద్దీతో సంబంధం లేకుండా, అత్యంత తక్కువ సమయంలో స్వామి వారి దర్శనం పూర్తవుతుంది. టికెట్ల విక్రయాల్లో దళారీల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ డిజిటల్ విధానాన్ని రూపొందించారు. భక్తులు తమ మొబైల్‌లో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో మెసేజ్ పంపడం ద్వారా సులభమైన పద్ధతిలో తమకు కావలసిన సేవలను ఎంచుకోవచ్చు. కార్యనిర్వహణాధికారి విజ్ఞప్తి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రవేశపెట్టిన ఈ 'మనమిత్ర' సేవలను భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నాము. ముందస్తు బుకింగ్ ద్వారా క్యూలైన్ల రద్దీని తగ్గించి, స్వామి వారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# హెల్మెట్ పెట్టుకోండి..ప్రాణాలు కాపాడుకోండి

## చింతూరులో అవగాహన, బైక్ ర్యాలీ - యువతకు కలెక్టర్, ఎస్పీ సందేశం

**పోలవరం జిల్లా ( చింతూరు , మే 10 ( మనం న్యూస్ ) :** చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా యువత హెల్మెట్ వాడకపోవడం వల్ల తీవ్ర గాయాలు, ప్రాణనష్టం జరుగుతున్నాయని భావించిన పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఐటీడీఏ అధికారులు కలిసి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు.

### హెల్మెట్ వాడితేనే ప్రాణం భద్రం

హెల్మెట్ వాడితేనే ప్రాణం భద్రం అనే నినాదంతో ఆదివారం చింతూరు ఐటీడీఏ ఆవరణ నుంచి సంత గ్రౌండ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్,ఐటీడీఏ పీవో శుభం నక్వాల్ , చింతూరు సిఐ గోపాలకృష్ణ తో పాటు పలువురు ఉన్నతాధికారులు, సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలు పాల్గొన్నారు. ప్రత్యేకంగా పోలీసులు, అధికారులు స్వయంగా హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొనడం ఇక్కడి యువతను ఆలోచింపజేసేలా కనిపించింది. ర్యాలీ అనంతరం సంత గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "మన కోసం ఎదురు చూసే కుటుంబం ఇంట్లో ఉంటుంది. అందుకే వాహనం నడిపేటప్పుడు భద్రతకు





ప్రాధాన్యం ఇవ్వాలి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. ఇది మన ప్రాణాలను మనమే కాపాడుకోవడం" అని తెలిపారు. అలాగే త్రిబుల్ రైడింగ్ వల్ల వాహనం అదుపుతప్పే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, యువత అలాంటి ప్రమాదకర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, "పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయొచ్చు. కానీ ప్రజల్లో ముందుగా అవగాహన పెంచడమే మా ఉద్దేశ్యం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ, సీఐ గోపాలకృష్ణ, నాలుగు మండలాల ఎస్సైలు, రెవెన్యూ శాఖ,వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావడంలో ఈ ర్యాలీ కొంతమేర ఉపయోగపడిందని, ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేసి ఉండి ఉంటే ఇంకా కొంతమేర ప్రజల్లోకి ఈ సందేశం ఎక్కువగా చేరి ఉండేదేమో అని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఏపీ విఏ జాయింట్ సెక్రటరీ డా.ప్రదీప్ కుమార్ లావేటి

**ముంచంగిపుట్టు , మే 10 ( మనం న్యూస్ ) :** విజయవాడలోని వెట్ హోమ్‌లో 2026 మే 10న నిర్వహించిన ఏపీ విఏ ఎన్నికల్లో డా. ప్రదీప్ కుమార్ లావేటి జోన్ -1 జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావడం పట్ల పశువైద్య వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది .ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచింగిపుట్టు వెటర్నరీ డిస్పెన్సరీలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా సేవలందిస్తున్న డా. ప్రదీప్ కుమార్ లావేటి పశుసంవర్ధక రంగ అభివృద్ధి, పశు వైద్యుల సంక్షేమం వృత్తి ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సహచర పశువైద్యులు, స్నేహితులు వివిధ జిల్లాల వెటర్నరీ అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమైన పశువైద్య సోదరభావం కోసం మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం అన్నారు.

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు వారి పరిధిలో ఉన్న రౌడీషీటర్లు,నేర చరిత్ర గల వ్యక్తులు,పాత నేరస్తులు మరియు చెడు నడవడిక కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి, సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని పోలీసులు సూచించారు. పోలీసుల సూచనలు, ఆదేశాలను లెక్కచేయకుండా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే




సంబంధిత వ్యక్తులపై అదనపు చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనలో మార్పు లేకుండా నేర కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని పేర్కొన్నారు.


# విద్య ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

## హాస్టళ్లలో కార్పొరేట్ స్థాయి వసతులు : కాకర సురేష్ కుమార్




**ఆనందపురం , మే 10 ( మనం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్‌లో బీసీ విద్యార్థుల విద్యా,ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని టిడిపి యువ నాయకుడు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.21 కోట్లతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం, నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.20 కోట్లతో ఇన్వర్టర్లు అందించడం, దోమల నివారణకు రూ.6 కోట్లతో దోమతెరలు పంపిణీ చేయడం ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 971కి పైగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు సన్నబియ్యం తో భోజనం వడ్డిస్తూ, మెనూ అమలుకు ప్రత్యేక సిబ్బందిని నియమించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అదేవిధంగా హాస్టళ్ల పరిశుభ్రత కోసం 1,291 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బీసీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అతని కుమారుడు గంటా రవితేజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కాకర సురేష్ కుమార్ పేర్కొన్నారు.

# పెద్దిపాలెం హైవేపై లారీ ఢీకొని కారు ధ్వంసం..త్రుటిలో తప్పిన ప్రమాదం



**ఆనందపురం , మే 10 ( మనం న్యూస్ ) :** ఆనందపురం –పెద్దిపాలెం హైవేపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. వేగంగా వెళ్తున్న ఓ లారీ, ముందున్న కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని డివైడర్ మధ్యలో నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనలో కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం తీవ్రతకు కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసమైంది. టైర్లు పేలిపోగా, వెనుక భాగం నుజ్జునుజ్జైంది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తూ ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ ఘటనతో కొంతసేపు హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



# కేపిల్ క్రికెట్ టోర్ని విజేత రాయల్స్ చాలెంజర్స్




**తగరపువలస , మే 10 ( మనం న్యూస్ ) :** భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ మహిళా అద్యుక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ ఆద్వర్యంలో తగరపువలస బంతాట మైదానంలో బెహరా వెంకట్ సూర్య కుమార్ జ్ఞాపకార్థం మూడు రోజులు పాటు నిర్వహించిన కె.పి.ఎల్ క్రికెట్ టోర్నమేంట్ ఆదివారం ముగిసింది. 5 జట్లు పాల్గొన్న ఈ టోర్ని లో రాయల్స్ చాలెంజర్స్ టీం, విల్సన్ సూపర్ కింగ్స్ ఫైనల్స్ కు చేరుకోగా ఇరు జట్లు మద్య పైనల్ ఆశక్తికరంగా జరగగా రాయల్స్ చాలెంజర్స్ జుట్టు విజయ కేతనం ఎగరవేసింది. ముగింపు కార్యక్రమం కి చిన్న శ్రీను సోల్జర్స్ అద్యుక్షురాలు సిరి సహస్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె కు నాయకులు ఘనమైన సాదర స్వాగతం పలికారు. కార్యక్రమం ను ఉద్దేశించి సిరి సహస్ర మాట్లాడుతూ డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ రాజకీయ పరంగా కాకుండా సమాజ సేవలు అందిస్తూ ముందుకు సాగడం చాలా అభినందనీయం అని కొనియాడారు. ఆమె అన్నయ్య సూర్య కుమార్ జ్ఞాపకార్థం టోర్నీ నిర్వహించి క్రీడాకారులు ను ప్రోత్సహించడం చేసారని, గ్రామ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి టోర్నీలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అనంతరం విన్నర్ మరియు రన్నర్ జుట్లు కు ట్రోఫీలను ప్రైజ్ మనీ ని సిరి సహస్ర చేతులు మీదుగా అందివ్వడం జరిగింది. భవిష్యత్తు లో మరిన్ని టోర్నీ లు నిర్వహిస్తానని ప్రశాంతి పట్నాయక్ తెలిపారు. టోర్నీ విజయ వంతం కావడంలో సహాయ సహకారాలు అందించిన క్రీడాకారులు కు పందిరి విజయ్ దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు నాయకులు అక్కరమాని రామానాయుడు, వైసిపి పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, విశాఖ జిల్లా వైసిపి పార్టీ అదికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, జిల్లా యస్సి సెల్ ప్రధాన కార్యదర్శి భాగం స్వాతి సుధాకర్, జిల్లా చేనేత విభాగం కార్యదర్శి తెడ్లాపు అప్పలరాజు,1వ వార్డు సీనియర్ నాయకులు జీరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో మెలగండి...!

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు..రౌడీషీటర్లకు కౌన్సెలింగ్.. యువ ఎస్పి మహేశ్వర్ రెడ్డి

**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు వారి పరిధిలో ఉన్న రౌడీషీటర్లు,నేర చరిత్ర గల వ్యక్తులు,పాత నేరస్తులు మరియు చెడు నడవడిక కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి, సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని పోలీసులు సూచించారు. పోలీసుల సూచనలు, ఆదేశాలను లెక్కచేయకుండా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే సంబంధిత వ్యక్తులపై అదనపు చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సత్ప్రవర్తనలో మార్పు లేకుండా నేర కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని ఎస్పి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# లక్ష్మీనరసింహ స్వామినీ దర్శించుకున్న విజయనగరం ఎంపీ దంపతులు

## - స్వాగతం పలికిన దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు



**సింహాచలం , మే 10 ( మనం న్యూస్ ) :** విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తమ ధర్మపత్నితో కలిసి ఆదివారం సింహగిరిపై కొలువై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎంపీ దంపతులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా సాదర స్వాగతం పలికారు.భక్తుల కోర్కెలు తీర్చే మహిమాన్వితమైన 'కప్పస్తంభాన్ని' ఎంపీ దంపతులు భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారినీ దర్శించుకుని దర్శనా నంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ, వేద మంత్రోచ్చారణలతో ఎంపీ దంపతులకు 'వేదాశీర్వచనం' అందజేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు స్వామివారి పవిత్ర ప్రసాదాలను, శేషవస్త్రాన్ని అందజేయడంతో పాటు, స్వామివారి జ్ఞాపికగా చిత్రపటాన్ని బహుకరించి గౌరవించారు.



## సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్ లలో పిజిఆర్ఎస్ కార్యక్రమం**
**నిర్వహణ : జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం , మే 10 ( మనం న్యూస్ ) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2026 మే 11 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 మే 11 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు జివిఎంసి కమిషనర్ తెలియచేశారు. 1) జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనది. 2) నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్ . టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనది. 3) అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు , వినాయక టెంపుల్ సమీపములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడమైనది. కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధా స్థానంలో ఉన్నవని తెలియపరచడమైనది.

# లేబర్ కోడ్ల రూల్స్ జీవో దగ్ధం చేసి కార్మిక సంఘాల నిరసన

## కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని సీఐటీయూ మండిపాటు




**చింతపల్లి , మే 10 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. లేబర్ కోడ్ల అమలుకు సంబంధించిన 28/2026 జీవో రూల్స్ కాపీలను దగ్ధం చేస్తూ తమ నిరసనను తెలియజేశాయి. ఆసుపత్రి ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యాక కార్మికులపై కక్షసాధింపు ధోరణితో లేబర్ కోడ్ల రూల్స్ అమలుకు జీవో విడుదల చేసిందని మండిపడ్డారు. లేబర్ కోడ్లు అమలైతే బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలు రద్దవుతాయని తెలిపారు. గత సంవత్సరం దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొని వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ సంవత్సరం కూడా 30 కోట్ల మంది కార్మికులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని విమర్శించారు. లేబర్ కోడ్ల అమలుతో ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానం రద్దై 12 గంటల పని విధానం అమల్లోకి వస్తుందని, ఇప్పటికే రాష్ట్రంలో కూడా 12 గంటల విధానానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మికులు ధర్నాలు, సమ్మెలు చేసే హక్కులను కూడా హరించేలా ఈ చట్టాలు ఉన్నాయని, పోరాటాలు చేస్తే భారీ జరిమానాలు లేదా జైలు శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. "ఇది ప్రజాస్వామ్య పాలనలా, లేక బ్రిటిష్ పాలనలా?" అని చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రామారావు, లక్ష్మి, ప్రసాద్ తదితర సానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.

# అనకాపల్లి ఇస్కాన్ మందిరంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**అనకాపల్లి , మే 10 ( మనం న్యూస్ ) :** రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రావణి ఆదేశాల మేరకు, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా, అనకాపల్లి జాతీయ రహదారిపై దైట్ ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు.అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ పర్యవేక్షణలో, ట్రాఫిక్ ఎస్.ఐ శేషగిరిరావు ఈ సదస్సులో పాల్గొని పిల్లలకు, పెద్దలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే విధించే జరిమానాల గురించి అవగాహన కల్పించారు. సదస్సు చివరలో ఇస్కాన్ మందిర వ్యవస్థాపకులు ప్రభుజీ గారి నేతృత్వంలో ఒక ముఖ్యమైన కార్యక్రమం జరిగింది. హాజరైన పెద్దలందరితో "మద్యం సేవించి వాహనాలు నడపమని, ఎల్లప్పుడూ చట్టాలకు లోబడి బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటామని" ట్రాఫిక్ ఎస్.ఐ సమక్షంలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. చిన్నప్పటి నుండే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఈ సందర్భంగా పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.







# జూన్ 12 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు

## మే 14, 21, 28, జూన్ 4, 11లలో అత్యవసర కేసులు విచారణ

**విశాఖపట్నం , మే 10 ( మనం న్యూస్ ) :** ఈ నెల 11 నుంచి జూన్ 12 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 15న పూర్తిస్థాయిలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ బెంచ్లు ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి ఉత్తర్వులిచ్చారు. మొదటి దశలో మే 14, 21, 28 తేదీల్లో విచారణలు ఉంటాయి. హైకోర్టు న్యాయ మూర్తులు డాక్టర్ జస్టిస్ వై. లక్ష్మణరావు, జస్టిస్ మేడమల్లి బాలాజీ డివిజన్ బెంచ్, జస్టిస్ తుహిన్ కుమార్ సింగిల్ బెంచ్ విచారణ చేపడతారు. రెండో దశలో జూన్ 4, 11 తేదీల్లో విచారణలు జరగనున్నాయి.

జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ హరిహరనాథ శర్మ డివిజన్ బెంచ్, జస్టిస్ ఎస్. సుబ్బారెడ్డి సింగిల్ బెంచ్లో కేసులను విచారిస్తారు. మరోవైపు డివిజన్ బెంచ్ కేసుల విచారణ పూర్తయ్యాక న్యాయమూర్తులు సింగిల్ బెంచ్ విధులనూ నిర్వహిస్తారు.

# సింహగిరిపై స్వర్ణకాంతుల శోభ..వైభవంగా 'స్వర్ణ పుష్పార్చన'

## పాల్గొన్న దేవస్థాన ఈఓ.జె వెంకట్రావు

**సింహాచలం , మే 10 ( మనం న్యూస్ ) :** సింహగిరి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. ఇక్కడ కొలువై ఉన్న భక్తవత్సలుడు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని "స్వర్ణ పుష్పార్చన" సేవ అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు.దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఆదేశానుసారం, ఆలయ అధికారుల పర్యవేక్షణ లో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ ఆధ్యాత్మిక క్రతువు కన్నులపండువగా సాగింది.వేకువజామునే అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, ప్రాతఃకాల పూజలు, సాంప్రదాయక విధివిధానాలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆలయ కళ్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ, వేద పారాయణ చేస్తూ స్వామివారికి ధగధగ మెరిసే బంగారు పుష్పాలతో అర్చన నిర్వహించారు.



ప్రతి సువర్ణ పుష్పం స్వామివారి పాద చెంత చేరుతుంటే, భక్తులు చేసిన 'గోవింద' నామస్మరణతో సింహగిరి కొండ మారుమోగింది. ఈ సేవలో పాల్గొన్న భక్తులందరికీ వారి గోత్ర నామాలతో సంకల్పం నిర్వహించారు. పూజానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, పవిత్ర ప్రసాదాలను పంపిణీ చేశారు.?"లోక కళ్యాణార్థం, భక్తుల సౌకర్యార్థం సింహగిరిపై ఇటువంటి విశేష ఆర్జిత సేవలను నిరంతరం నిర్వహిస్తున్నాం. ఈ స్వర్ణ పుష్పార్చన సేవలో పాల్గొనడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం."ఋ భక్తులకు గమనిక:ఋ స్వామి వారి ఈ విశేష స్వర్ణ పుష్పార్చన సేవ ప్రతి గురువారం మరియు ఆదివారం అత్యంత వైభవంగా జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆ నరసింహుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థాన యంత్రాంగం కోరింది.









## విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన భారీ వాహనం

**చోడవరం , మే 10 ( మనం న్యూస్ ) :** చోడవరం గవరవరం రోడ్డులో పెద్ద వెలమ వీధిలో భారీ లారీ ఒకటి ఆదివారం విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో పెద్ద వెలమ వీధిలో వాహనాల రాకపోకలు, విద్యుత్ సరఫరా నిలిచిపోయాయి. చోడవరం లో ట్రాఫిక్ సమస్య తో పాటు పెద్ద వాహనాలు ఇరుకు సందుల్లో వెళుతుండడంతో తరచూ వాళ్ళ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు గతంలో బజారు వీధి గుండా భారీ వాహనాలు వెళ్ళేవని అన్నారు. ట్రాఫిక్ సమస్య, వాహనాల రాకపోకలు, ప్రమాదాలపై అధికారులు పర్యవేక్షించి తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజా రక్షణ, భద్రత చేపట్టవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

## ఎరువుల ధరలు తగ్గించాలి

### కౌలు రైతుల సంఘం డిమాండ్



**అమరావతి , మే 10 ( మనం న్యూస్ ) :** కాంప్లెక్స్ ఎరువుల ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం ఎరువులపై సబ్సిడీని పెంచి ధరలు పెరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఉన్న ధరలపై సుమారు 20 శాతం వరకు పెంచి రైతులపై అదనపు భారం మోపారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.బలరాం, ఎం.హరిబాబులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20:20 ఎరువు బస్తా ధరను రూ.1500 నుంచి రూ.1800కు పెంచారని, ఇదే విధంగా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినట్లు తెలిపారు. ఇప్పటికే మార్కెట్లో ఉన్న ఎరువులపై కూడా కొత్త ఎంఆర్పీలు నిర్ణయించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని వెల్లడించారు. పెంపుదలను ఉపసంహరించుకొని, పాతరేట్లకే ఎరువులమ్మాలని డిమాండ్ చేశారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

## అవగాహనతోనే సాధ్యం

**ఉత్తరాంధ్ర క్రైమ్ , మే 10 ( మనం న్యూస్ ) :** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో పోలీస్ అధికారులు సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ పరధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్,మైనర్ డ్రైవింగ్(స్పెషల్ డ్రైవ్)తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి మరియు సరైన వాహన పత్రాలు లేనివారికి ఫైన్ లు వేయడం జరిగింది. ఆదేవిదంగా అన్ని రకాల వాహన దారుల డ్రైవరులందరు ను సమావేశపరిచి వారికి రోడ్డు భద్రతా నియమాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రైవర్లందరితో రోడ్డు భద్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది . జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీట్, సస్పెక్ట్, కేడి, లను స్టేషన్ కు పిలిపించి వారి ప్రస్తుత జీవన విధానం గురించి ఆరా తీసి కౌన్సిలింగ్ ఇస్తూ మీపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ వుంటుందని హెచ్చరిస్తూ ఎటువంటి చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలు నిర్వహించకుండా మంచి నడవిడికతో జీవించాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా శక్తి టీం సిబ్బంది గస్తీ నిర్వహించి మహిళలపై నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలలో నిఘా వేసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తూ . అదేవిధంగా కాలేజీలు, రద్దీ ప్రాంతాలలో మహిళలకు విద్యార్థులకు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి దాని వినియోగం గురించి విశదీ కరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు , మరియు సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రద్దీప్రాంతాల పై దృష్టి పెట్టాలని పార్వతీపురం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాలలో క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్,సైబర్ క్రైమ్, డ్రగ్స్, చైన్ స్నాచింగ్ దొంగతనాలు నిరోధించడంతోపాటు హెల్మెట్ మరియు రోడ్ భద్రతా నియమాలు తప్పకా పాటించేటట్లు చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.

# హనుమ జయంతి సందర్భంగా స్వామివారికి జలాభిషేకం

**జి.మాడుగుల , మే 10 ( మనం న్యూస్ ) :** కైలాసగిరి క్షేత్రం నందు వెలిసిన శ్రీ పంచముఖ దేవాలయం నందు శ్రీ హనుమ జయంతి పూజలు తెల్లవారు ఐదు గంటలకు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త భీమిలి సద్గురు సేవాశ్రమం నిర్వాహకులు సాయిరాం స్వామీజీ తెలిపారు. 12వ తేదీ మంగళవారం ఐదు గంటలకి మందిరమునకు విచ్చేయువారికి స్వామివారికి జలాధివాసంలో భాగంగా నీరు తీసుకుని స్వయంగా గర్భగుడిలో ప్రవేశించే అవకాశం ఉంటుంది. తదుపరి సహస్రనామం పూజలు కూడా నిర్వహించబడును. దయచేసి భక్తులు ఈ సదా అవకాశమును వినియోగించుకుని స్వామివారి పూజలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించవలసినదిగా అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

# హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు



**ఆనందపురం , మే 10 ( మనం న్యూస్ ) :** మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు వద్ద ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలకుడు శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఈనెల 12వ తేదీ మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం చందనంతో ప్రత్యేక అలంకరణ, సింధూరార్చన, నాగవల్లి దళార్చన, పుష్పార్చన తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. తరువాత నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే భక్తుల ఆధ్యాత్మిక ఉల్లాసం కోసం గొర్లె సూర్యనారాయణ మాస్టారు బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాల కచేరి, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ కోరారు.

# అంబేద్కర్ కాలనీలో అక్రమ మద్యం బెల్టు షాపును తొలగించాలి



**కంచికచర్ల , మే 10 ( మనం న్యూస్ ) :** కంచికచర్ల స్థానిక అంబేద్కర్ కాలనీలో గత కొంత కాలంగా అనాధికారికంగా, అక్రమంగా నిర్వహిస్తున్న టువంటి బెల్ట్ షాపును శాశ్వతంగా తొలగించాలని నిర్వాహకుల మీద చట్టప రమైన,కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపిటీసీ సభ్యులు బిర్రె.ఉ దయ్ కిరణ్ మరియు అంబేద్కర్ యూత్ యువకు లు శనివారం ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ కంచికచర్ల సిఐ అఫ్రపున్నిసా బేగంను కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ద్వారా ఉదయ కిరణ్ అంబేద్కర్ కాలనీలో అక్ర మంగా నిర్వహిస్తున్న టువంటి బెల్ట్ షాపు ద్వారా కాలనీలోని చాలా కుటుంబాలు చిన్న భిన్నమై వీధిన పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ బెల్ట్ షాప్ కారణంగా అనునిత్యం గొడవలు,కొట్లాటలు జరిగి కేసులపాలయ్యి జీవితాలను కోల్పోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే దారిలో బెల్ట్ షాపు ఉండటం వలన వారు మానసికంగా వేదనకు గురవుతున్నారని తెలిపారు.ఈ బెల్ట్ షాప్ కారణంగా అనేక ఇబ్బందులు ఉన్నాయి కాబట్టి తక్షణమే తొలగించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అంబేద్కర్ యూత్ సభ్యులు గారపాటి సూర్యవంశీ,బడుగు కోటేశ్వరరావు,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### మోడి సర్కార్ లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ దగ్ధం చేస్తూ నిరసన

**అచ్యుతాపురం (అనకాపల్లి) , మే 10 ( మనం న్యూస్ ) :** లేబర్ కోడ్స్ పై రూల్స్ నోటిఫికేషన్ 8వ తేదీ రాత్రి నుండి మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనిని నిరసిస్తూ .... ఎస్ ఈ జెడ్ లో నోటిఫికేషన్ కాపీలు దగ్ధం చేసి ఆదివారం నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. రాము మాట్లాడుతూ .... ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత లేబర్ కోడ్ లను అమలులోకి తీసుకొన్నా నోటిఫికేషన్ తీసుకొచ్చిందన్నారు.

దీనివలన వేతనాలు కోడ్ 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్ 2020 లను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలు రద్దయిపోతాయి. దీనివలన ప్రస్తుతమున్న ఎనిమిది గంటల పని దినం 12 గంటల వరకు పని చేయించుకునే అధికారం వచ్చి ఇతర కార్మికులు తమ హక్కులను నష్టపోయి యాజమాన్యాలకు కార్మికుల శ్రమను అప్పణంగా కట్టబెట్టడమే అవుతుందని వాపోయారు. ఈ లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన పోరాట కార్యక్రమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కారు సత్యం, ఎరునాయుడు ,రాజన్న సన్యాసిరావు, లాలం సన్యాసిరావు ,అప్పారావు, రెడ్డి రామానాయుడు సిరిసిపల్లి అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్మించాలి

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగించాలి : చర్చా గోష్టిలో వక్తలు

**అమరావతి , మే 10 ( మనం న్యూస్ ) :** పేదవాడు వైద్యునిగా తయారయ్యే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలని సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను వాటికి అనుబంధంగా ఆసుపత్రులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. 'నిర్మాణంలో ఉన్న 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వం వెంటనే నిర్మించాలి- అనే అంశంపై ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో చర్చా గోష్టి శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడదని అన్నారు. రెండేళ్ల నుంచి వైద్య కళాశాలలు శిథిలావస్థకు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు వేలకోట్లు దోచిపెడుతున్న ప్రభుత్వం వైద్య కళాశాలలు పూర్తిచేసేందుకు డబ్బులు లేవనడం పచ్చి అబద్ధం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో డేటా సెంటర్ కు గూగుల్ పేరుతో అదానీకి రూ.22వేల కోట్లు ప్రయోజనం కలిగించేందుకు ఆగమేఘాలపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ నిధులతో వైద్య కళాశాలలతో పాటు విద్యారంగాన్ని కూడా అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రైవేట్ రంగంలో అభివృద్ధి బ్రహ్మాండంగా జరుగుతోందనే ప్రచారం అబద్ధమన్నారు. గతంలో లాగే మరలా జాతీయయుగం ప్రారంభమైందన్నారు. హైదరాబాద్ లో మెట్రో రైలు సంస్థను ఎల్ అండ్ టి కంపెనీ నిర్వహించలేకపోవడంతో ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవడమే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని దీనివల్ల సామాజిక న్యాయం జరగదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క వైద్య విద్య ఫీజు కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. వెనుకబడి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తే పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కొద్దిపాటి పెట్టుబడి పెడితే ఈ కళాశాలలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించేలా విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు అందరూ కలిసి ఉద్యమించాలని, ఆ ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని వెంకటేశ్వరరావు(నాని) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రభుత్వానికి సంబంధం లేని పరిస్థితికి తీసుకొచ్చిందని చెప్పారు. వెనుక బడిన కులాలకు వైద్య విద్యను దూరం చేసే ప్రక్రియను విడనాడాలని హితవు పలికారు. ప్రజల ఆస్తులను అమ్మే ప్రభుత్వాన్ని నడపాలనే ఆలోచనకు చంద్రబాబు స్వస్తి పలకాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల పరిరక్షణ కోసం ప్రజా సంఘాలు నిర్వహించే పోరాటానికి తాము మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అన్నీ ప్రైవేట్ యూనివర్సిటీలే వస్తున్నాయని, విద్యను అందని ద్రాక్షలా మార్చిన దుస్థితి కలుగుతోందన్నారు. విజన్ 2047 పేరిట చంద్రబాబు నాయుడు చేపడుతున్న తిరోగమన విధానాలను ఎండ గట్టాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ కట్టబెట్టాలనుకుంటున్న వైద్య కళాశాలలు వెనుకబడ్డ ప్రాంతాల్లో ఉన్నాయని చెప్పారు. కళాశాలలు, వీటికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు ప్రభుత్వమే పూర్తిచేస్తే ఈ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు, రోగులకు మేలు జరుగుతుందని చెప్పారు. పరిరక్షణ కమిటి కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్ కేటాయించిన మెడికల్ సీట్లను తిరస్కరించిన ప్రభుత్వం మనదేనని ఆందోళన వ్యక్తం చేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఒక్క ఇటుక, ఒక్క రూపాయి అదనంగా వ్యయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను నిర్వీర్యం చేసి వాటిని ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు దారాధత్తం చేసే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. సామాజిక వేత్త కుర్ర వసుంధర ప్రైవేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చే బదులు ప్రభుత్వమే వైద్య కళాశాలలను నడపవచ్చు అని చెప్పారు. జనచైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి టి ధనుంజయ రెడ్డి స్వాగతోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో న్యాయవాది రజిని మాట్లాడుతూ కాసులకు కక్కుర్తి పడకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు.

# 'సిక్కోలు షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానం




**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళంలో నిర్వహించిన 'సిక్కోలు షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రభుత్వ బడులు భావి పౌరులను తీర్చిదిద్దే విద్యా దేవాలయాలని పేర్కొన్నారు. విద్యార్థులు మార్కులతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ టాపర్లను సత్కరించి కెరీర్ గైడెన్స్ అందించారు.

## పారిశుధ్యంపై అలసత్వం వద్దు : కలెక్టర్ స్వప్నిల్



**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** నరసన్నపేటలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రధాన మార్గాల్లో ఎలాంటి పారిశుధ్య లోపాలు లేకుండా చూడాలని సూచించారు. వార్డు ఇన్‌చార్జ్ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు.

## బారువ స్మశాన వాటికలో బర్నింగ్ షెల్టర్ నిర్మాణం



**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** దా సీపాన గుణవతి బారువ గ్రామ స్వర్గధామంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో బర్నింగ్ షెల్టర్ నిర్మించి గ్రామ ప్రజలకు అంకితమిచ్చారు. తన తల్లిదండ్రులు, సోదరుడి జ్ఞాపకార్థంగా నిర్మించిన ఈ మండపాన్ని గ్రామపంచాయతీకి అప్పగించారు. చివరి యాత్రలో ప్రజలకు సౌకర్యం కల్పించాలనే సేవాభావంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు.

# జల వనరుల సంరక్షణ మనందరి బాధ్యత

**ఆనందపురం , మే 10 ( మనం న్యూస్ ) :** భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జల వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. పద్మనాభం మండలం రెడ్డిపల్లి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన "ఉన్నత భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో "జలధార" కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బోని గణేష్ మాట్లాడుతూ భూమి వాతావరణ వ్యవస్థలో పంచభూతాల సంరక్షణ అత్యంత కీలకమని తెలిపారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకుంటేనే భూమిపై ప్రాణికోటి మనుగడ కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి వనరులను సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందుతాయని, చెరువుల పరిరక్షణ అందరి సామూహిక బాధ్యతగా భావించాలని సూచించారు. "చెరువు పని కూలీ కోసం కాదు.. భవిష్యత్తు కోసం" అనే భావనతో ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెరువుల పూడికతీత, నీటి నిల్వల పెంపు వంటి కార్యక్రమాలు భూగర్భ జలాల స్థాయిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అలాగే జీవితంలోని ముఖ్యమైన సందర్భాల్లో మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ, వీఆర్పీ శ్రీను, వేతనదారులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

- ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు
- వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వ్యవసాయ,సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి , మే 10 ( మనం న్యూస్ ) :** సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహా అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# 143 ఉద్యమి సభ్యత్వాలతో 'ఐ లవ్ యూ పవన్ కళ్యాణ్' సందేశం

**పాడేరు , మే 10 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ సాధక్, ఐటీ టీం కో-ఆర్డినేటర్ సీహెచ్ అనిల్ కుమార్ 143 ఉద్యమి సభ్యత్వాలు పూర్తి చేసి 'ఐ లవ్ యూ పవన్ కళ్యాణ్' అంటూ తన అభిమానాన్ని మరోసారి చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు అవకాశం కల్పించిన డా. వంపూరు గంగులయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానం జీవితాంతం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉద్యమి సభ్యత్వాలు పార్టీకి కవచంలాంటివని, పారదర్శక రాజకీయాల కోసం అందరూ భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి సభ్యులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత : వంగలపూడి అనిత

**అమరావతి , మే 10 ( మనం న్యూస్ ) :** మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. తల్లుల త్యాగాలను మరవొద్దని పేర్కొన్నారు. అందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు (ఆదివారం) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గోశాల వృద్ధ మహిళల ఆశ్రమంలో మదర్స్ డే వేడుకల్లో అనిత, ఎమ్మెల్యే బోడేప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. ఆ ఆశ్రమంలో ఎంతమందోకి ఆశ్రయం కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. చాలామంది మాతృమూర్తులు వారి పిల్లలకు దూరంగా ఉన్నారని తెలిపారు. వాళ్లకు ఒక చిన్న ఆనందాన్ని ఇవ్వాలని, వాళ్లందరి దీవెనలు పంచుకోవాలని ఈ ఆశ్రమానికి తాను వచ్చానని అన్నారు. వీళ్లందరి కళ్లలో కనిపిస్తున్న ఆనందం, వాసవి మహిళా మండలి నడుపుతున్న తీరు తనకు చాలా స్ఫూర్తిని ఇచ్చిందని హోంమంత్రి అనిత తెలిపారు. ఈ ఆశ్రమం తమదే అనే భావన



వారిలో ఉందని చెప్పుకొచ్చారు. సమాజంలో తల్లికి ఇచ్చే గౌరవస్థానం ప్రపంచంలో ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. దేవుడు కూడా ప్రథమ స్థానాన్ని తల్లికే ఇచ్చారని ప్రస్తావించారు. అలాంటి తల్లులు ఎప్పుడూ ఇబ్బంది పడకూడదని సూచించారు. పిల్లలను కనిపెంచడానికి వాళ్లు ఎన్ని త్యాగాలు చేస్తారో అందరికీ తెలుసునని తెలిపారు. ఒక బిడ్డను కనడానికి తల్లి ఎంతగానో ప్రసవ వేదన పడుతోందని అన్నారు. అలాంటి తల్లులందరికీ ఒక ఆసరాగా నిలబడాల్సిన అవసరం మనందరిపై ఉందని చెప్పుకొచ్చారు. అందుకే ఈరోజు తన పిల్లలిద్దరినీ కూడా తీసుకువచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేశానని తెలిపారు. మహిళల విషయంలో మంత్రి నారా లోకేశ్ చూపుతున్న స్ఫూర్తిని కూడా మనం ఆదర్శంగా తీసుకోవాలని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. సమాజంలో తల్లిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఈ ఆశ్రమంలోని తల్లులందరిని ఒకసారి కలిసి వారి ప్రేమను పంచుకోవాలనే ఇక్కడికి వచ్చామని.. వారి కష్టసుఖాలు కూడా విన్నానని చెప్పుకొచ్చారు. ఈరోజు వృద్ధుల ఆశ్రమాలు ఎక్కువగా పెరుగుతున్నాయని.. ఆ అవసరం లేకుండా ప్రతి బిడ్డ కూడా తల్లిని చూసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి ఒక్కరూ కూడా మహిళలను గౌరవించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు.

## బుదరావలసలో ప్రారంభమైన శ్రీశ్రీ మజ్జి గౌరమ్మ ఉత్సవాలు



**రాయగడ , మే 10 ( మనం న్యూస్ ) :** శనివారం నుండి స్థానిక బుధర వలస లో మజ్జి గౌరమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు. కానీ ఈ సంవత్సరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోజులు పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. కనివిని ఎరుగని భారీ రీతిలో ముగింపు వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

## తోటపాలెంలో వీర అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన



**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం నగరంలోని తోటపాలెం జంక్షన్ వద్ద విశ్వహిందూ పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీ వీర అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోండు శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ స్వామివారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** జూనియర్ ఎన్ టీ రామారావు . 43వ పుట్టినరోజు సందర్భంగా శ్రీకాకుళంలో ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమా న్ని ఎమ్మెల్యే గోండు శంకర్ ప్రారంభించి, రక్తదానం ప్రాణాలను కాపాడే మహాదానం అని పేర్కొన్నారు. సేవా కార్యక్రమం నిర్వహించిన అభిమానులను అభినందించారు.

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

**పరవాడ , మే 10 ( మనం న్యూస్ ) :** యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి మహమ్మారిపై పరవాడ పోలీసులు యుద్ధం ప్రకటించారు. 100 రోజుల యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం దేశపత్రునిపాలెంలో సీఐ ఆర్. మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన యువత తమ బంగారు భవిష్యత్తును బుగ్గి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి విక్రయం, నిల్వ, వినియోగం వంటి అక్రమ చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామంలోని గంజాయి విక్రేతలు, వినియోగదారుల చిట్టా సిద్ధం చేశామని, నిఘా తీవ్రం చేస్తున్నామని తెలిపారు. మత్తుకు బానిసైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నట్లు వివరించారు. గ్రామ భద్రత కోసం స్థానికుల సహకారంతో త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, సమాచారం తెలిస్తే పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు యువత పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు : జిల్లా కలెక్టర్

**నరసన్నపేట , మే 10 ( మనం న్యూస్ ):** పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావులేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నరసన్నపేటలో పర్యటించి, పారిశుధ్య పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఏర్పాట్లు తుది దశకు చేరుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శనివారం ఉదయమే నరసన్నపేట చేరుకున్న కలెక్టర్, వెంకటేశ్వర థియేటర్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. రోడ్ల వెంట ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్ మరియు పంచాయతీ అధికారులకు సూచించారు.



ముఖ్యమంత్రి పర్యటించే ప్రధాన మార్గాల్లో ఎక్కడా పారిశుధ్య లోపాలు కనిపించకూడదని హెచ్చరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వార్డుల వారీగా నియమించిన ఇన్చార్జ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో పట్టణం సుందరంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి ఇంట్లో చోరీ




**రణస్థలం , మే 10 ( మనం న్యూస్ ) :** మండల కేంద్రంలోని వేంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న నెలివాడ పంచాయతీ కార్యదర్శి డి.మల్లేశ్వరరావు ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను చూసేందుకు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి లావేరు మండలం లక్ష్మీపురం వెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టి ఉందని మల్లేశ్వరరావుకు ఇంటి సమీపంలో ఉన్నవారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అతడు వచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ. 1.20 లక్షల నగదు పోయినట్లు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం రూరల్ పరిధి సింగుపురం పంచాయతీ మునసబుపేట గ్రామానికి చెందిన బుంగ తేజశ్వని కనిపించడం లేదని ఆమె తల్లి రాజులమ్మ ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాము ఆదివారం తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదని, దీంతో రాజులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వైసీపీ నేతలు ఐదేళ్లు పీకలు కోసి..ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదం : మంత్రి కొల్లు రవీంద్ర

**- రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్ రెడ్డిని స్వయం ప్రకటిత మేథావులు వెనకేసుకొస్తున్నారు**
**- మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా, ఎన్.ఆర్.ఐ కోటా ప్రకటించింది జగన్ రెడ్డే**
**- రోజూ వేల మంది పేదలకు వైద్యం అందించే ఎయిమ్స్ పట్ల కూడా వివక్ష చూపిన దుర్మార్గుడు జగన్ రెడ్డి**
**- జగన్ రెడ్డి అనే అరాచక శక్తి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి కొల్లు రవీంద్ర**



**అమరావతి , మే 10 ( మనం న్యూస్ ) :** జగన్ రెడ్డి అనే అరాచక శక్తిని మహాత్ముడు అనేలా చూపించేందుకు కొంత మంది స్వయం ప్రకటిత మేథావులు పడుతున్న తాపత్రయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతల వైఖరిని ఖండించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ఐదేళ్లు బడుగు బలహీన వర్గాల ప్రజల పీకలు కోసి.. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారు. రాష్ట్రాన్ని తామే ఉద్ధరించామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్ని రోడ్డున పడేశారు. అన్ని రంగాలను సర్వ నాశనం చేశాడు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టింది అన్న ఎన్టీఆర్. తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గారు ఉమ్మడి రాష్ట్రంలో 22 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. తిరుపతిలో బర్డ్స్, టాటా ఇనిస్టిట్యూట్ లాంటి ఎన్నో ప్రఖ్యాత ఆస్ప్రతులు ఏర్పాటు చేశారు. చివరికి మంగళగిరిలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఎయిమ్స్ ఏర్పాటు చేస్తే.. ఆ సంస్థకు మంచినీరు కూడా ఇవ్వకుండా జగన్ రెడ్డి వేధించాడు. కూటమి అధికారంలోకి వచ్చాక కృష్ణా నది నుండి పైపులైన్ ఏర్పాటు చేసి నీరు అందించాం. ఎప్పుడో కట్టించిన ఎన్టీఆర్ యూనివర్శిటీ పేరు మార్చుకోవడం తప్ప జగన్ రెడ్డి రాష్ట్ర వైద్య రంగంలో చేసిందేంటి? పేదలకు నాణ్యమైన వైద్యం, పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించే లక్ష్యంతో ప్రకటించిన పీపీపీ విధానం గురించి కనీసం అవగాహన కూడా లేకుండా మాట్లాడడం సిగ్గుచేటు. జగన్ రెడ్డి ప్రభుత్వ సీట్లలో 50 శాతం సీట్లు ప్రైవేటుకు కేటాయించేలా నిర్ణయిస్తే.. పీపీపీ విధానంలో అధనంగా 220 సీట్లు తీసుకొచ్చి 110 సీట్లు ప్రైవేటుకు ఇచ్చేలా కూటమి నిర్ణయించింది. జగన్ రెడ్డి 15 శాతం సీట్లు ఇతర రాష్ట్రాలకు కేటాయిస్తే.. పీపీపీ విధానంలో కేంద్ర కోటా కింద 15 శాతం సీట్లు ఏపీకి వస్తున్నాయి. జగన్ రెడ్డి చెప్పిన విధానంలో మెడికల్ కాలేజీలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. కానీ పీపీపీ విధానంలో రెండేళ్లలోనే పది మెడికల్ కాలేజీలు పూర్తి చేసి 1750 సీట్లు అధనంగా సాధించేలా సన్నాహాలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకోవడం లక్ష్యంగా జగన్ రెడ్డి అండ్ కో ఆది నుండి మెడికల్ కాలేజీల విషయంలో రాద్ధాంతం చేస్తోంది. ప్రపంచం మొత్తం మెచ్చి అమలు చేస్తున్న పీపీపీ విధానాన్ని విమర్శించడంతో పాటుగా, ఎవరైనా ముందుకొస్తే ఊరుకునేది లేదని బెదిరించడం జగన్ రెడ్డి రాక్షస ప్రవృత్తికి నిదర్శనం. ఈ రోజు మెడికల్ కాలేజీల గురించి నీతులు చెబుతున్న జగన్ రెడ్డి 107, 108, 133 జీవోల ద్వారా మేనేజ్ మెంట్, సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల కేటాయింపు గురించి మాట్లాడరెందుకు? పీపీపీ విధానంలో రెండేళ్లలో నిర్మాణాలన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటే.. విమర్శలు చేయడానికి జగన్ రెడ్డి సహా కుహానా మేథావులు సిగ్గుపడాలి. కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోంది. ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే 16800 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్1, గ్రూప్2, పోలీస్ డిపార్టుమెంట్‌లో రిక్రూట్ మెంట్ ద్వారా వేలాది ఉద్యోగాలు కల్పించాం. ప్రైవేటు రంగంలో ఇప్పటికే 6 లక్షల ఉద్యోగాలు కల్పించాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యం దిశగా పయనిస్తున్నాం. రాష్ట్రం కోసం ప్రజల కోసం చేస్తున్న కృషిని చూసి ఓర్వ లేక వైసీపీ నేతలు నీచ రాజకీయాలకు, కుట్రలకు తెరలేపుతున్నారు. ఈ రోజు నీతులు మాట్లాడుతున్న జగన్ రెడ్డి సహా వైసీపీ బ్యాచ్ మొత్తాన్ని ప్రశ్నిస్తున్నా.. ఐదేళ్లు అధికారంలో ఉన్నారు. ఏం ఉద్ధరించారో సమాధానం చెప్పగలరా? అధికారంలోకి రాగానే ప్రజావేధికను కూల్చారు. అమరావతిపై విషం చిమ్మి మూడు రాజధానులంటూ దగా చేశారు. రాష్ట్రానికి జీవనాడిలా నిలిచే పోలవరం ప్రాజెక్టును పొరుగు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎత్తు తగ్గించి సొంత రాష్ట్ర ప్రజలను దెబ్బతీశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రాష్ట్రంలో అభివృద్ధిని నాశనం చేశారు. పీపీఏలను రద్దు చేసి విద్యుత్ ఛార్జీల మోత మోగించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో పేదల జేబులకు చిల్లు పెట్టారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారు. మాస్కులు అడిగితే చంపారు. మద్యం కల్తీని నిలదీస్తే చంపారు. ఇసుక అక్రమ రవాణా గురించి ప్రశ్నిస్తే చంపారు. చివరికి మీ పార్టీకి వంతపాడలేదని కూడా నడిరోడ్డుపై బడుగు బలహీన వర్గాల వారి పీకలు కోశారు. జీవో నెం.2430తో మీడియాను అణగదొక్కారు. జీవో నెం.217తో మత్స్యకారుల జీవనోపాధిని కూడా సొంత వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నించారు. నాడు నేడు పేరుతో ప్రభుత్వ కార్యాలయాలకు మీ పార్టీ రంగులేసుకుని వేల కోట్లు దోచుకున్నారు. కమిషన్ల కోసం పోర్టుల్ని అమ్మేశారు. కేసుల కోసం రైల్వే జోన్ అంశాన్ని పక్కన పెట్టారు. మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారు. దాదాపు 30 వేల మంది మీ ధన దాహానికి కిడ్నీలు, లివర్ ఫెయిల్యూర్‌తో ప్రాణాలొదిలారు. ఇళ్ల పట్టాల పేరుతో దోచుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల ఆస్తుల్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చివరికి ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా దోచేసేందుకు ప్రయత్నించిన విషయాన్ని మీ వద్ద సీఎస్‌గా పని చేసిన ఎల్వీ సుబ్రహ్మణ్యం బయటపెట్టారు. అధికారం కోసం ఎవర్నైనా బలిస్తారని, ఎవర్నైనా బలిచేయడానికి వెనుకాడరని బాబాయి హత్య విషయంలో మీ వ్యవహార శైలి బయటపెట్టింది. తండ్రిని చంపిన వారిని పట్టించమని వేడుకున్న సునీతపైనే తిరిగి కేసులు పెట్టి వేధించావు. ఆస్తిలో వాటా అడిగినందుకు చెల్లెలిని రోడ్డున పడేశావు. పెయిడ్ ఆర్టిస్టులతో చెల్లి పుట్టుకను కూడా ప్రశ్నించి.. తల్లిని అవమానించావు. సొంత తండ్రి కూడా జగన్ రెడ్డిని ఏపీకి రానివ్వొద్దని, బెంగళూరులోనే ఉండమన్నారని అత్యంత దగ్గరి వ్యక్తులు బయటపెట్టారు. పరిటాల రవి హత్య కేసులో జగన్ రెడ్డిని తప్పించడానికి రెండు నెలలు నిద్రలేని రాత్రులు గడిపానని కిరణ్ కుమార్ చెప్పారు. పరిటాల రవి హత్య వెనుక జరిగిన కుట్ర మొత్తం రవీంద్ర రెడ్డి బయటపెట్టారు. ఎన్నికల్లో గెలవడం కోసం కోడికత్తి, గులకరాయి లాంటి ఎన్నో డ్రామాలాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. సంక్షేమం అందించాలి. సూపర్ సిక్స్ పథకాల లబ్ది ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదల కోసం పని చేస్తున్న ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు సహించేందుకు సిద్ధంగా లేరు. జగన్ రెడ్డి లాంటి అరాచక శక్తి విషయంలో ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగానే ఉంటారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## సిపిఐ లిబరేషన్ లో భారీ చేరికలు

**శ్రీకాకుళం , మే 10 ( మనం న్యూస్ ) :** సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో శనివారం నాడు రాయగడ జిల్లా, కోలనార బ్లాక్ పరిధిలోని కేడపడ పంచాయతీ, గడ్బా సమీపంలో, జిల్లా కార్యదర్శి త్రిపాఠి గమాంగ్, జిల్లా నాయకులు ఒక బహిరంగ సభను నిర్వహించారు. వందలాది మంది బిజెడి, కాంగ్రెస్, బిజెపిలను వీడి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీలో చేరారు. అటవీ భూమి, ఇల్లు, గృహ ధృవీకరణ పత్రాలు అందించడం, వి.బి.జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. చట్టాన్ని అమలు చేయడం, విద్యుత్, విత్తన చట్టాన్ని రద్దు చేయడం, రోజుకు 600 రూపాయల వేతనం అందించడం, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 5 లక్షల రూపాయలు అందించడం, రేషన్ కార్డులు ఉన్న క్షేత్ర కార్మికులందరికీ 50 కిలోల బియ్యం అందించడం, రోడ్ల నిర్మాణంపై విచారణ జరపడం ఇలా పలు డిమాండ్లతో జూన్ 10న కొల్నారా తహసీల్ కార్యాలయం, బ్లాక్ కార్యాలయం ముందు నిరసన తెలపడం ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని తీర్మానించారు . ఈ సర్వసభ్య సమావేశంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి త్రిపాఠి గమాంగ్ భక్త మినియాకా, కృష్ణ మినియాకా, మేదిరి గార్డియా, రామారావు కుత్రుకా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహావిష్ణు,నాగలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**పాడేరు , మే 10 ( మనం న్యూస్ ) :** శ్రీమహావిష్ణు సమేత శ్రీ నాగలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, భక్తులు మరియు కూటమి నేతలతో కలిసి శనివారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారిని దర్శించుకున్నారు. మహా విష్ణు,నాగలక్ష్మి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం కనుల విందుగా జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే సౌమ్య కి అక్షింతలు వేసి ఆశీర్వచనం అందించారు. దేవాలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కోగంటి బాబు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు



**నరసన్నపేట , మే 10 ( మనం న్యూస్ ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 16న నరసన్నపేట పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జమ్ము, తామరాపల్లి వద్ద ప్రతిపాదిత స్థలాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. హెలీప్యాడ్ స్థల అనుకూలతలపై అధికారులతో చర్చించారు. హెలీప్యాడ్ స్థల విస్తీర్ణం మ్యాప్ ద్వారా నిశితంగా పరిశీలించారు. వాహనాల పార్కింగ్, వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గం తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. హెలీప్యాడ్ స్థల మైదానాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో వేణుగోపాలరావు, ఆర్అండ్‌బీ ఈఈ తిరుపతిరావు, తహసీల్దార్ సత్యనారాయణ, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు గణేష్, రంజిత్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

**జలుమూరు (సారవకోట) , మే 10 ( మనం న్యూస్ ) :** గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సారవకోట గ్రామానికి చెందిన బొల్లు తిరుపతిరావు (54) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో తిరుపతిరావు ఇంటిలో ఉన్న గడ్డిమందు శనివారం తాగి అస్వస్తకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో తొలుత నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. తిరుపతిరావు భార్య మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. తిరుపతిరావుకు పెళ్లైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం



**నరసన్నపేట , మే 10 ( మనం న్యూస్ ) :** నారాయణవలస సంత నుంచి అక్రమంగా విశాఖపట్నం వైపు తరలిస్తున్న పశువుల వాహనాన్ని ఎస్ఐ గణేష్ ఆదివారం జమ్ము పంచాయతీ శివరాంపురం వద్ద పట్టుకున్నారు. తొమ్మిది ఆవులతో వెళ్లుతున్న వాహనం ఎవరికి అనుమానం రాకుండా గడ్డెయ్యపేట మీదుగా శివరాంపురం నుంచి జాతీయ రహదారిపై తరలించే సమయంలో అక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వాహనంను పట్టుకున్నారు. పశువులను అక్రమంగా తరిలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి వాహన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. గోవులను గోశాలకు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

# కైలాసగిరి త్రిశూలం

## ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి ప్రతీక : మంత్రి నారా లోకేశ్

**విశాఖపట్నం , మే 10 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం కైలాసగిరిలో ఏర్పాటు చేసిన 65 అడుగుల భారీ త్రిశూలం ఏపీ వ్యాప్తంగా ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్(ఫూా వీఆఅ-ఆర్వతీ ఛీుతీుు ూశీఎవంష్ట్ర) సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విశాఖ కైలాసగిరిని గుజరాత్‌లోని పవిత్ర సోమనాథ ఆలయంతో లోకేశ్ పోల్చారు. తన పోస్టులో సోమనాథ ఆలయ చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర సోమనాథ ఆలయం చారిత్రక పునరుద్ధరణ జరిగి రేపటితో 75 సంవత్సరాలు పూర్తవుతున్నాయని వివరించారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కైలాసగిరిలో 65 అడుగుల భారీ త్రిశూలాన్ని ఆవిష్కరించడం ఆధ్యాత్మిక,



సాంస్కృతిక పునరుజ్జీవ నానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వం దేశ సంస్కృతిలో ఎంత లోతుగా పాతుకుపోయిందో ఈ నిర్మాణాలు తెలియజేస్తు న్నాయని నారా లోకేశ్ అన్నారు. సోమనాథ్ నుంచి వైజాగ్ వరకు భారతదేశపు ఆధ్యాత్మిక వారసత్వం సంస్కృతి, విశ్వాసం, మంచితనంలో పాతుకుపోయి మరింత బలంగా ఎదగడానికి మనకు స్ఫూర్తినిస్తోందని లోకేశ్ తెలిపారు. విశాఖపట్నం సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న కైలాసగిరి ఇప్పటికే ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు అక్కడ ఏర్పాటు చేసిన భారీ త్రిశూలం మరింత ఆధ్యాత్మిక ఆకర్షణగా మారింది. సోమనాథ్ ముందు విస్తరించిన సముద్రం దృఢత్వానికి, విశ్వాసానికి ప్రతీకగా నిలిచినట్లే, కైలాసగిరి కూడా సముద్రానికి అభి ముఖంగా నిలుస్తూ అదే శాశ్వతమైన ఆధ్యాత్మిక స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కైలాసగిరిలో భారీ త్రిశూలం ఏర్పాటు చేయడం ద్వారా విశాఖపట్నంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ఊతమిస్తుందని భక్తులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి సోయగాలు, రోప్‌వే, శివపార్వతి విగ్రహాలతో ప్రసిద్ధి చెందిన కైలాసగిరి ఇప్పుడు ఈ భారీ త్రిశూలంతో మరో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని భక్తులు చెబుతున్నారు. ఈ భారీ త్రిశూలాన్ని చూసేందుకు స్థానికులతో పాటు పర్యాటకులు కూడా పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబబొమ్మాళి , మే 10 ( మనం న్యూస్ ) :** ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గం ప్రజలతోపాటు నందిగాం మండల ప్రజానీకం నుంచి వివిధ సమస్యలపై వినత పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా.. ఆయన ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత



అధికారులను ఆదేశించారు. అలాగే మండలం పెద్దబమ్మిడి గ్రామంలో నిర్వహిస్తున్న కోదండరామాలయ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఆ గ్రామస్థులు మంత్రికి ఆహ్వానపత్రిక అందించారు. టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శిమ్మ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా దూసి..గోల్డెన్ యూత్ ముందడుగు

**ఆమదాలవలస , మే 10 ( మనం న్యూస్ ) :** 'మన ఊరు-మన పరిశుభ్రత-మన బాధ్యత' నినాదంతో వనసేన స్ఫూర్తిగా దూసి ఆర్ఎస్ గోల్డెన్ యూత్ గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం దూసి ఆర్ఎస్‌లో ప్రత్యేకంగా ఐరన్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ కలెక్షన్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు గాను గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, చాక్లెట్ కవర్లు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా ప్రజలు ఈ కలెక్షన్ యూనిట్‌లో వేయాలని సూచించారు. ఇలా సేకరించిన వస్తువులను రీ సైక్లింగ్ యూనిట్లకు పంపి పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీనికి ప్రజలంతా సహకరించాలని గోల్డెన్ యూత్ సభ్యుడు ఎం.రాజశేఖర్ కోరారు. భవిష్యత్‌లో దూసి పంచాయతీ అంతా దీనిని అమలు చేస్తామన్నారు. ఎం.నిర్మల జ్ఞాపకార్థం రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఎంసీపీ రావు కుటుంబ సభ్యుల పేరిట ఈ యూనిట్ల ఏర్పాటుకు ప్రసాద్ మల్లపురెడ్డి సహకరించారన్నారని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో సంస్థ సభ్యులు గౌతమ్, రామకృష్ణ, శివ, రాజగోపాల్, ధనుంజయరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.